సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 25 । మార్చి । 2023



**తోడేస్తున్నారు..**
భీంపూర్ మండలం గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదిలోని ఇసుకను అక్రమార్కులు యథేచ్ఛగా తోడేస్తున్నారు. ట్రాక్టర్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 9లో▸

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| శని : 6:28 | ఆది : 4:53 |

గరిష్టం/కనిష్టం
35.0 /24.0

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆదిలాబాద్‌రూరల్:** టెన్త్, ఇంటర్, డిగ్రీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 50 మందికి, ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన మరో 50 మందికి గ్రూప్–1లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్‌సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు అందించే ఉచితశిక్షణలో నెలకు రూ.5వేలు స్టైఫండ్, స్టడీమెటీరియల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులు ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ, స్టడీసర్టిఫికెట్‌తోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08732 221280 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే, రైతులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తూ..

**తాంసి/బోథ్:** భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్మాణంలో దాదాపుగా 1100 ఎకరాల భూమిని కోల్పోతున్నామని, వెంటనే పరిహారం అందజేయాలని కోరారు. ఈ మేరకు త్వరలోనే పరిహారం అందేలా చూస్తామని రైతులకు మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారి వెంట రైతు ప్రతినిధులు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, గంగయ్య, వినోద్ యాదవ్, రాంరెడ్డి, మల్లేశ్, షేక్ హైమద్, అశోక్ తదితరులు ఉన్నారు.

### టీబీ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**ఆదిలాబాద్‌టౌన్:** టీబీ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్ కళాశాలలో శుక్రవారం టీబీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీబీ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధిగ్రస్తులు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విద్యా విల్సన్, సరోజ, ఆయా శాఖల హెచ్‌వోడీలు పద్మావల్లి, సంజయ్, భానుప్రకాశ్, ప్రజ్ఞ, పావని, తదితరులున్నారు.

### జిల్లాలో 2.30 లక్షల మందికి కంటి పరీక్షలు

**ఆదిలాబాద్‌అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కింద జిల్లాలో ఇప్పటి వరకు 2.30 లక్షల మందికి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ప్రారంభమైన మలివిడత కార్యక్రమంలో దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు, అవసరమైన మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నామన్నారు. 18 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించేందుకు జిల్లాలో 42 రోజుల పాటు 1386 క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. 24,445 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 26,382 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులకు సిఫారసు చేయగా, 9,176 మందికి అందించామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 186 గ్రామ పంచాయతీలు, 28 మున్సిపల్ వార్డుల్లో క్యాంపులు నిర్వహించామని, 27 జీపీలు, ఆరు మున్సిపల్ వార్డుల్లో క్యాంపుల నిర్వహణ కొనసాగుతుందన్నారు. జిల్లాలో వంద శాతం స్క్రీనింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### 'భయభ్రాంతులకు గురి చేసినా తగ్గేది లేదు'


**ఆదిలాబాద్‌టౌన్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ అధినాయకత్వాన్ని టార్గెట్ చేసి భయభ్రాంతులకు గురి చేసినా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. పట్టణంలోని ఆమె నివాసంలో శుక్రవారం విలేకరులతో మాటాల్డారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎంపీగా అనర్హత వేటువేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అవినీతిని వెలికితీస్తే అనర్హత వేటు వేస్తారా.. అని ప్రశ్నించారు. దేశ సంపదను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, రూపేశ్‌రెడ్డి, తదితరులున్నారు.

# రిమ్స్‌లో కలెక్షన్ క్వీన్!

- రిమ్స్‌లో పనిచేసే ఓ మహిళా అధికారి ఇటీవల తన బర్త్‌డే కోసం స్టాఫ్ నర్సుల నుంచి రూ.500 చొప్పున వసూలు చేయించారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూప్‌లో ఓ ఉద్యోగి ఫోన్‌పేలో డబ్బులు జమ చేయాలని మెసేజ్ పెట్టారు. చేసేది లేక వారంతా అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేశారు. వాటిని నగదు రూపంలో సంబంధిత అధికారికి అందజేయడంతో పాటు బంగారు ఉంగరం సైతం కానుకగా అందజేసినట్లు వారు తెలిపారు.
- ఇటీవల రిమ్స్ ఉన్నతాధికారి బర్త్‌డే ఉందని, ఆయనకు ట్రీట్ ఇవ్వాలని చెప్పి వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చేశారు. ఆ అధికారికి ఎలాంటి సమాచారం లేకుండానే ఒక్కో ఉద్యోగి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేశారు. విషయం ఆయనకు తెలిసి నివ్వెరపోయారు. తన పేరు చెప్పి ఎందుకు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా రిమ్స్‌లో అనేక రూపంలో డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది.






స్టాఫ్ నర్సులు ఓ ఉద్యోగికి ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించిన దృశ్యాలు

- స్టాఫ్‌నర్సుల నుంచి వసూళ్లు
- నజరానాగా.. నగదు, చీరలు, నగలు
- ఇబ్బందులకు గురవుతున్న సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

**ఆదిలాబాద్‌టౌన్:** ఇటీవల ఎన్ని విమర్శలొస్తున్నా రిమ్స్‌లోని కొందరు అధికారులు, ఉద్యోగుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. కలెక్షన్‌లో ఏకంగా రాటుదేలుతున్నారు. ఏడాది క్రితం స్టాఫ్ నర్సుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఇటీవల ఓ జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అక్రమాల నేపథ్యంలో కొంతమందిపై వేటుపడుతున్నా మిగతా వారిలో ఏ మాత్రం భయం కనిపించకపోవడం గమనార్హం. విచ్చలవిడిగా కింది స్థాయి ఉద్యోగుల నుంచి వసూలు చేయడంతో పాటు వేధింపులకూ పాల్పడుతున్నారు. తాజాగా ఓ మహిళా అధికారి స్టాఫ్ నర్సుల నుంచి అందినకాడికి దండుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు నెలలకోసారి ఏదో సాకుతో కలెక్షన్ చేస్తున్నట్లు బాధితులు పేర్కొంటున్నారు. బిర్యానితో పాటు నగదు, నగలు, చీరలు.. ఇలా కానుకల రూపంలో తీసుకోవడం ఆమెకు పరిపాటిగా మారింది. ఇవి ముట్టజెప్పని వారిని టార్గెట్ చేస్తూ చుక్కలు చూపుతున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆమె ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదని తెలుస్తోంది.

**వసూళ్లు ఇలా..**
మహిళా అధికారి వసూళ్ల పర్వానికి నలుగురు ఉద్యోగులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. నగదును నేరుగా తీసుకోకుండా ఇద్దరు స్టాఫ్‌నర్సులు, కింది స్థాయి ఉద్యోగుల అకౌంట్లలో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వసూలు చేయిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌లో తన బర్త్‌డే, ఉన్నతాధికారి బర్త్‌డే, న్యూ ఇయర్ వేడుకలు, పండగలు, పబ్బాలు.. అంటూ వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ఇవ్వని వారిని టార్గెట్ చేస్తున్నారు.

**కాసులివ్వకుంటే.. నైట్ డ్యూటీ**
రిమ్స్ ఆస్పత్రిలో నెలలో ఓ ఉద్యోగి మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే సదరు అధికారికి కాసులు అప్పజెప్పకుంటే అంతే సంగతి. వారు నెలల తరబడి నైట్ డ్యూటీ చేయాల్సిందే. 'మామూలుగా' ఉండే వారికి మాత్రం మర్యాదలు, వారు అనుకున్న షిఫ్టులో డ్యూటీలు ఉంటాయి. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు కొందరు రోజుల తరబడి విధులకు హాజరుకాకున్నా ఒకే రోజు వచ్చి సంతకాలు పెట్టుకున్న సందర్భాలు సైతం ఉన్నాయని స్టాఫ్ నర్సులు పేర్కొంటున్నారు. నజరానా సమర్పిస్తే సమయపాలన పాటించకున్నా ఆమె చూసీచూడనట్లు ఉంటారని చెబుతున్నారు. సదరు అధికారి సైతం తరచూ విధులకు ఎగనామం పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉద్యోగులు సెలవు మంజూరు కోసం ఆమె వద్దకు వెళితే డోర్ వద్ద గంటల తరబడి నిరీక్షణ తప్పదు. ఆమె సంబంధీకులు ఉన్నతాధికారులుగా ఉండడంతో బాధితులు ఫిర్యాదుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

### విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

సంబంధిత అధికారి అక్రమాలకు పాల్పడుతున్న విషయం నా దృష్టికి రాలేదు. ఉద్యోగులు, సిబ్బంది ఎవరు కూడా అధికారులకు డబ్బులు ఇవ్వకూడదు. ఎవరైనా అడిగితే నా దృష్టికి తీసుకురావాలి. విచారణ చేపడతాం. డబ్బులు ఇచ్చినవారు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే సంబంధిత సెక్షన్‌లోనూ ప్రక్షాళన చేస్తాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

# సమష్టి భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఉత్తమ సర్పంచ్‌లకు పురస్కారాలు



సన్మాన గ్రహీతలతో కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ షేక్ బాషా తదితరులు

**కైలాస్‌నగర్:** సర్పంచ్‌లు, కార్యదర్శుల సమష్టి భాగస్వామ్యంతోనే గ్రామస్వరాజ్య స్థాపన సాధ్యపడుతుందని ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ 2021–22కు ఎంపికైన జిల్లాలోని 27 ఉత్తమ పంచాయతీ పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. తొమ్మిది అంశాల్లో ప్రతిభ కనబరిచిన సర్పంచ్‌లు, కార్యదర్శులను శాలువా, మెమోంటోతో సత్కరించారు. ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దేశంలోనే మన గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ ముఖరా (కే) గ్రామపంచాయతీని ఆదర్శంగా తీసుకుని జాతీయ స్థాయిలో అవార్డులు సాధించేలా మిగతా జీపీలు పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, రాజు, సుధాకర్, చారులత, అరుంధతి, ఎంపీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

**గర్భిణుల హైరిస్క్ బాధ్యత మెడికల్ ఆఫీసర్లదే**
ప్రసూతి కోసం ఆరోగ్యకేంద్రాలకు వచ్చే హైరిస్క్ గర్భిణుల బాధ్యత మెడికల్ ఆఫీసర్లదేనని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లతో ప్రసూతి మరణాలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో అవగాహన లోపం, కట్టుబాట్లతోనే ప్రసూతి మరణాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతీ కేసుకు సంబంధించిన వివరాలు ఆయా వైద్యాధికారులు చర్చించాలన్నారు. గర్భిణులను ప్రసవానికి ముందే బర్త్ వెయిటింగ్ రూమ్‌కు తరలించాలని సూచించారు. నిర్ణీత సమయానికి ఏఎన్సీ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎనీమియా సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ, డీఎంహెచ్‌వో నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్, ప్రోగ్రాం అధికారి విజయసారథి, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండొద్దు**
జిల్లాలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకునే విధంగా వ్యాపారులు, థియేటర్ యజమానులు, షాపింగ్ కాంప్లెక్ నిర్వాహకులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రాథమికంగా వినియోగించే ఫైర్ మిషన్లను పరిశీలించాలని, ఎక్స్‌పైరీడేట్‌ను తనిఖీ చేయాలని ఫైర్ ఆఫీసర్‌ను ఆదేశించారు. జిల్లాలో సోషల్ ఆడిట్‌కు సంబంధించి 1500 పేరాలు ఉన్నాయని, ఇప్పటి వరకు 407 పేరాలను క్లియర్ చేశామన్నారు. రానున్న రెండు వారాల్లోగా అన్ని అభ్యంతరాలను పరిష్కరిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూముల వివరాలను పరిశీలించి ఇంటి స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, అదనపు కలెక్టర్లు, పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని, పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రిజ్వాన్ బాషా షేక్, ఎస్.నటరాజ్, అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలి

**ఆదిలాబాద్‌టౌన్:** క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. క్షయ నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. యాక్టీవ్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి వారికి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది 1,565 కేసులు నమోదయ్యాయని, ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 238 కేసులు నమోదైనట్లు వివరించారు. నిక్షయ్ పోషణ్ అభియాన్ కింద గతేడాది వ్యాధిగ్రస్తులకు రూ.500 చొప్పున అందజేశామన్నారు. రోగుల రవాణా ఖర్చుల కోసం 662 మందికి రూ.750 చొప్పున అందించినట్లు తెలిపారు. ఏప్రిల్ 13 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించిన భీంపూర్, తలమడుగు, నార్నూర్ మెడికల్ ఆఫీసర్లకు, వివిధ ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. అంతకు ముందు ట్రెయినీ కలెక్టర్ శ్రీజ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సాధన, క్షయ నివారణ అధికారి శ్రీకాంత్, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# ఫ్చ్..ధర రాకపాయె!



పత్తిని విక్రయించేందుకు తాంసి మండలకేంద్రంలో ట్రాక్టర్‌లో నింపుతున్న రైతు సోమన్న

- పత్తి రైతుల నిట్టూర్పు
- నిరీక్షించినా దక్కని ఫలితం
- ఆవిరైన 'గిట్టుబాటు' ఆశలు
- మార్కెట్ బాటపట్టిన నిల్వ చేసిన దిగుబడి
- ఇటీవలే పెరిగిన కొనుగోళ్లు

**ఈ రైతు పేరు జి.ప్రకాశ్.**



తాంసికి చెందిన ఈయన గత వానాకాలంలో ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. అప్పట్లో 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. 30 క్వింటాళ్లు ఖర్చుల నిమిత్తం అమ్మేసి మిగతా 50 క్వింటాళ్లను మూడు నెలలుగా నిల్వ చేశాడు. ధర రూ.10 వేలు వస్తుందని ఆశతో ఇలా చేశాడు. అయితే పరిస్థితులు అనుకూలించలేదు. మొదట్లో అమ్మిన పత్తికి క్వింటాలుకు రూ.8వేల పైబడి వచ్చింది. ఇప్పుడు ఆదిలాబాద్ మార్కెట్‌లో కేవలం రూ.7300 వరకే వచ్చే పరిస్థితి ఉంది. దీంతో పక్కనున్న మహారాష్ట్రలోని సార్కణిలో మరో రూ.200 అధికంగా వస్తుందని అక్కడకు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాడు.

**ఈ రైతు పేరు బి. శ్రీనివాస్.**



బోథ్‌కు చెందిన ఈయనకు గత వానాకాలంలో పత్తి దిగుబడి 50 క్వింటాళ్లకుపైగా వచ్చింది. గిట్టుబాటు ధర లేదని కొన్ని నెలలుగా ఇంట్లోనే నిల్వ చేశాడు. ఆగితే ధర పెరుగుతుందని ఆశ పడ్డాడు. అయితే పెరుగుడేమో కానీ భారీగా తగ్గతుండడంతో ఇటీవలే రూ.7300 చొప్పున విక్రయించాడు. రూ.10వేలకుపైగా వస్తుందని అనుకున్నా.. కానీ ఆశలన్నీ అడియాశలయ్యాయని వాపోయాడు ఈయన.

**సాక్షి,ఆదిలాబాద్:** గత వానాకాలంలో జిల్లాలో రైతులు గంపెడాశతో పత్తిని సాగు చేశారు. ఏకంగా 4 లక్షల 11 వేల ఎకరాల్లో సాగు నమోదైంది. అంతకు ముందు ఏడాది క్వింటాల్ ధర రూ.10 వేలు పలకడంతో ఈ సారి కూడా అదే పరిస్థితి ఉంటుందని ఆశపడ్డారు. అయితే వారనుకున్నది ఒకటైతే.. అయ్యింది మరోటి. దీంతో వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. నెలల తరబడి పత్తిని అమ్మకుండా దిగుబడులను ఇంట్లో నిల్వ చేసిన వారు ఇక ఓపిక నశించి ధర పెరిగేటట్టు లేదని మార్కెట్ బాట పడుతున్నారు. గత్యంతరం లేక విక్రయిస్తున్నారు. గతంలో విక్రయాలు ప్రారంభమైన మొదటి నాలుగు నెలల్లో పెద్ద మొత్తంలో కొనుగోళ్లు జరిగేవి. ఇప్పుడు మాత్రం చివరి మూడు నెలల్లో అత్యధికంగా కొనుగోళ్లు నమోదవడం గమనార్హం. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 8,23,724 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరిగాయి. గతేడాది ఇదే సమయానికి 9,31,600 క్వింటాళ్ల కొనుగోళ్లు నమోదయ్యాయి.


**నెల వారీగా పత్తి కొనుగోళ్లు ఇలా**

| నెల | క్వింటాళ్లు |
|---|---|
| అక్టోబర్-22 | 4050 |
| నవంబర్-22 | 79,128 |
| డిసెంబర్-22 | 1,62,215 |
| జనవరి-23 | 1,94,549 |
| ఫిబ్రవరి-23 | 2,14,185 |
| మార్చి-23 | 1,69,597 (ఇప్పటి వరకు) |

**ఇదీ పరిస్థితి..**
గడచిన ఏడాది అక్టోబర్ 14న జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,380 ఉండగా, ప్రైవేట్‌లో మొదటి రోజు క్వింటాల్‌కు రూ.8300 ధర పలికింది. ఆ తర్వాత ధర పెరుగుతూనే వచ్చింది. ఓ దశలో రూ.9 వేలకు పైబడింది. అప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో పత్తి బేల్ ధర రూ.76వేల నుంచి రూ.80 వేల వరకు పలికింది. అదే విధంగా పత్తి సీడ్ ధర క్వింటాల్‌కు రూ.3,700 నుంచి రూ.4 వేల వరకు పలికింది. ఈ ధరలు మరింత పెరుగుతాయని రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. రూ.పదివేల మార్కు దాటుతుందని భావించారు. అయితే రాను రాను ఈ ధరలు తగ్గుతూ వచ్చాయి. గతంలోనూ ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్న రైతులు సంక్రాంతి పండగ తర్వాత ధర పెరుగుతుందని ఆశించారు. పెరగడం మాటేమోగానీ ఉన్న ధర తగ్గుతూ రావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. అయినప్పటికీ భరోసాతో నిల్వ పత్తిని అలాగే ఉంచారు. అయితే పరిస్థితుల్లో ఏ మార్పు లేకపోవడం.. ధర మరింత తగ్గుతుండడం.. నిల్వ చేసిన పత్తి బరువు దిగిపోవడం.. నాణ్యత లోపించడం.. వంటి పరిస్థితులతో తల్లడిల్లిపోయారు. ఈ క్రమంలో భారంగానైనా తక్కువ ధరకే పత్తిని విక్రయించేందుకు సిద్ధమయ్యారు. నెలన్నర రోజులుగా జిల్లాలో పత్తి కొనుగోళ్లు పెరగడానికి ఈ పరిస్థితులు కారణమయ్యాయి.

**ఎగుమతులపై ప్రభావం కారణమా..?**
సాధారణంగా అంతర్జాతీయ మార్కెట్లో పత్తి దిగుబడుల ఎగుమతులు అధికంగా ఉన్నప్పుడు దేశంలో పత్తి ధర పెరుగుతూ వస్తుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే కరోనా, భూకంపాలు, రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధ ప్రభావం ఈ కొనుగోళ్లపై పడింది. దీంతో పత్తి కొనుగోళ్లు చేసే అనేక దేశాల్లో క్రమంగా కూడు, గూడుపై అధిక ప్రాధాన్యత ఇవ్వడం.. పరోక్షంగా పత్తి కొనుగోళ్లపై పడింది. దేశం నుంచి ఎగుమతి లేకపోవడంతో ధరలు పడిపోయాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా పత్తి రైతు చిత్తయ్యాడు.

### మార్కెట్‌కు పత్తి ఇంకా రావాల్సి ఉంది



మెల్లమెల్లగా పత్తి నిల్వలను రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇంకా పెద్ద మొత్తం రావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది లక్షల క్వింటాళ్లకుపైగా కొనుగోళ్లు జరిగాయి.

– శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్

# వేతనాలు, బిల్లులు విడుదల చేయాలి



ధర్నాలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు

- ట్రెజరీ కార్యాలయం ఎదుట యూఎస్‌పీసీ ధర్నా

**కైలాస్‌నగర్:** పెండింగ్ వేతనాలు, సప్లిమెంటరీ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన వేతనాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఉపాధ్యాయుల సప్లిమెంటరీ వేతనాలు, పెండింగ్ బకాయిలు, సెలవు వేతనాలు, పెన్షనర్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీఎస్‌జీఎల్‌ఐ తదితర బిల్లులన్నీ ట్రెజరీల్లో ఆమోదం పొందినా ఏడు నెలలుగా సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ కాకపోవడం శోచనీయమన్నారు. అనంతరం ట్రెజరీ డీడీ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముందు ప్రణాళికే... సాగుకు మందు



నెన్నెలలో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 15.50 లక్షల ఎకరాల్లో సాగు అంచనా
- వేసవి దుక్కులతో ఎంతోమేలు
- భూసార పరీక్షలు చేయించడం కీలకం
- అధిక ఎరువులతో అనర్థాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగు మరో రెండు నెలల్లో ప్రారంభం కానుంది. మే మూడో వారం నుంచే రైతులు దుక్కి దున్నడం, చేన్లు చదును చేయడం, గతేడాది పంట మొదళ్లు ఏరి కాల్చడం, తదితర పనులు మొదలుపెడుతారు. జూన్‌లో వర్షాలు మొదలవ్వగానే పంట రుణాలు, విత్తనాలు సమకూర్చుకోవడంతో సాగు పనులకు శ్రీకారం చుడుతారు. కానీ రైతులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సాగుకు సిద్ధమైతే మంచి దిగుబడులు సాధించేందుకు దోహదపడనుందని వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్ చెబుతున్నారు. పంట సాగుకు ముందు తీసుకోవాల్సిన పలు సూచనలు ఆయన మాటల్లోనే..

**భూసార పరీక్షలు..**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 15.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుకు అధికారులు అంచనా వేశారు. అయితే పంట సాగుకు ముందు భూసార పరీక్షలు అవసరం. భూసార విలువలను తెలుసుకుని కాలానుగుణంగా సాగు తీరును మార్చుకోవాలి. పరీక్షల ద్వారా భూమిలో సూక్ష్మస్థూల పోషకాల లోపాలు, మోతాదు పద్ధతిలో ఎరువుల వాడకంతో అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలుంది. పొటాష్ వాడాకాన్ని రైతులు కచ్చితంగా అలవర్చుకోవాలి. ఆధునిక యంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటించడంతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు.

**ప్రణాళికాబద్ధంగా పెట్టుబడి...**
పంట సాగుకు ముందు నుంచే ఖర్చులను లెక్కించుకోవాలి. పెట్టుబడులకు అనుగుణంగా విత్తనాలకు, కూలీలకు, ఎరువుల కొనుగోలుకు వ్యయాన్ని సమకూర్చుకోవాలి. బ్యాంకు రుణాలు పొందడానికి రైతులు ముందుగానే భూపత్రాలకు సంబంధించి పహాణి పత్రాలను సిద్ధం చేసుకోవాలి. బ్యాంకర్లు రెండు రకాలుగా నీటిపారుదల కింద ఎకర పత్తికి రూ.40 నుంచి 45వేలు అందించనున్నారు. వర్షాధారం ద్వారా సాగుయ్యే పత్తి, వరి రూ. 35 నుంచి 45 వేల వరకు అందజేస్తారు.

**నాణ్యమైన విత్తనాలు..**
పంట సాగులో ప్రధానమైంది విత్తనాల ఎంపిక. పత్తిలో బీటీ విత్తనాలు దాదాపు 34 సంస్థలు వందల రకాలను మార్కెట్లో సిద్ధంగా ఉంచుతున్నాయి. పత్తి ప్యాకెట్ 450 గ్రాముల ధర రూ.960 తీసుకుంటున్నారు. ఆయా కంపెనీల డీలర్ల ద్వారా రైతులను ఆకట్టుకునే విధంగా ప్రచారం చేస్తున్నాయి. ఇందులో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలు అందిస్తుందనే విషయంలో రైతులకు సరైన అవగాహన లేకుండా పోతోంది. దీంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే రసాయనాల వాడకం అవసరం మేరకే వాడాలి.

**పత్తి మెదళ్లను భూమిలో కలిపివేయడం..**
పత్తి పంట దిగుబడి అనంతరం పత్తి చెట్ల మెదళ్లను కోసి కుప్పగా చేసి తగలబెడుతుంటారు. అలా కాకుండా రోటవేటర్ సాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు కలియదున్నాలి. రోటవేటర్ తర్వాత మల్డ్ చెల్ట్ నాగలితో దున్నాలి. తర్వాత మరో సారి రోటవేటర్‌తో కలియదున్నాలి. ఈ విధంగా చే యడంతో భూమి సారవంతం పెరగడమే కాకుండా పత్తి పంటకు కావాల్సిన ఎరువులు తగ్గించుకోవచ్చు.

**వేసవి దుక్కులు కీలకం...**
వానాకాలం సాగుకు ముందు నుంచే చేనును చదును చేసుకుని వేసవి తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. తదితర పంటల కోతల తర్వాత భూమిని వృధాగా వదిలి వేయకుండా వేసవిలో దుక్కి దున్నినట్లయితే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. లోతుగా దున్నడంతో వరుసకు వరుస మధ్యలో వర్షపు నీరు నిలిచి లోపాలికి చేరుతుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తరువాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, చెరువు మట్టిని పొలంలో వేదజల్లుకుంటే పంట దిగుబడికి సామర్థ్యం పెరుగుతుంది.

**సాలుకు అడ్డంగా దున్నడం..**
సాలుకు అడ్డంగా సేద్యం చేస్తే నీటి సంరక్షణ పెరుగుతుంది. విత్తనం వేయడం, అంతరకృషి చేయడంతో వర్షపు నీరు వాలుగ ఉన్న వైపు పరిగెత్తే అవకాశం ఉండదు. నీటి వేగం తగ్గి భూమిలోకి ఇంకడానికి అవకాశం కలుగుతుంది. ఎక్కువ నీరు భూమిలోనికి ఇంకడం వలన భూమిలో నిలువ పెరుగుతుంది.

**సేంద్రియ ఎరువులు..**
సేంద్రియ ఎరువులు నేలలో కుళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు అవసమైన స్థూల, సూక్ష్మపోషకాలను అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవగుణాలపై ప్రభావం చూపి నేల సత్తువను, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. సేంద్రియ ఎరువుల్లో పశువుల, కోళ్ల, గొర్రెల, వానాపాముల ఎరువును ఎకరానికి సుమారుగా 2- 4 టన్నుల వరకు వాడుకోవచ్చు. ఈ సేంద్రియ ఎరువులను విత్తడానికి 20-25 రోజుల ముందు వేసి భూమిలో కలియదున్నాలి. దీంతో భూమి గట్టి పడకుండా గుల్లగా ఉంటుంది.

## పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పురుగుల మందుతాగి మహారాష్ట్రకు చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బో కర్ తాలుక కాసర్‌పేటతాండకు చెందిన పవర్ ర సూల్ (21) మద్యానికి బానిసయ్యాడు. గత కొన్ని నెలలుగా మద్యం తాగుతూ ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో బాధితుడి కుటుంబీకులు మందలించడంతో ఈ నెల 17న సాయంత్రం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం బోకర్ ఆసుపత్రికి అక్కడి నుంచి నాందేడ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం తెల్లవారు జామున రిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన ఎలుగు పెద్ద ఆడేలు(51) గతంలో మద్యం మత్తులో కిందపడడంతో తలకు తీవ్రంగా గాయమైంది. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. మద్యం మత్తులో శుక్రవారం గ్రామ సమీపంలోని నర్సారెడ్డి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఏఎస్సై గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## చెరువులో దూకి ఒకరి ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ చెరువులో దూకి శుక్రవారం స్థానిక ప్రియదర్శనగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(50) ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై పట్టణ సీఐ మల్లేశ్‌ను వివరణ కోరగా ఆ వ్యక్తికి గత కొన్ని రోజుల నుంచి మానసికస్థితి బాగలేదని, అందుకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు చూసి వెంటనే కాపాడారని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### తిర్పెల్లిలో అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీలో శుక్రవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.కాలనీలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలోని ఖాళీ స్థలంలో పోగు చేసిన చెత్త కుప్పలకు ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు ఈ విషయమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కొద్ది దూరంలో స్క్రాప్, గ్యాస్ గోదాములు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది.

### గుడుంబా పట్టివేత

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో గుడుంబా విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 13లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. గుడుంబాను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, ముత్యం, గౌతం, భాస్కర్, ఇర్ఫాన్, కల్పన ఉన్నారు.

### స్మాష్ రాకెట్ చాంపియన్ షిప్‌లో కడెం యువకుడి ప్రతిభ



టీం సభ్యులతో మర్రిపెల్లి వెంకటేశ్

కడెం: ఈ నెల 15 నుంచి 17 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించిన స్మాష్ రాకెట్ చాంపియన్ షిప్‌లో కడెం మండలంలోని నవబ్‌పేట్ గ్రామానికి చెందిన మర్రిపెల్లి వెంకటేశ్ ప్రతిభ కనబర్చాడు. ఫైనల్స్‌లో రాష్ట్ర జట్టు టోర్నీ విన్నర్‌గా గెలుపొందడంలో ప్రతిభ కనబర్చి బ్రౌన్స్ మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

### 'భక్తితో కొలిస్తే దేవుడే సేవకుడవుతాడు'



మాట్లాడుతున్న సంత్ శేఖర్ మహారాజ్

గుడిహత్నూర్ : నిస్వార్థమైన భక్తితో దేవుడిని కొలిస్తే ఆ దేవుడే భక్తుడికి సేవకుడవుతాడని సంత్ శ్రీ శేఖర్ మహారాజ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గామాత విగ్రహ ప్రాణప్రతిష్ట చేసి ఆయన మాట్లాడారు. సంతుల మార్గదర్శనంలో భక్తులు నడిస్తే దేవుడి కృపకు పాత్రులవుతారని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామారావ్ మహారాజ్‌లు సూచించిన మార్గం సమస్త జాతి అభివృద్ధికై వారు పాటుపడిన తీరు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎమ్మెల్యే బాపురావ్ కుమారుడు విశ్వజిత్, కార్యక్రమ అన్నదాత గిత్తే మదన్‌లను ఆయన సత్కరించి ఆశీర్వదించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, ఆలయ స్థలదాత స్థానిక సర్పంచ్ రాంజీ, లంబాడ సంఘ నాయకులు జాదవ్ రమేష్, పవార్ రవీందర్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం



సమావేశంలో మాట్లాడుతున్న సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు సీఎం కేసీఆర్ నష్టపరిహారాన్ని ప్రకటించినట్లే, ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను సైతం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులను జాతీయ విపత్తు సహాయ నిధి పథకం కింద ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి అందజేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలోని బాధిత రైతులకు ఎకరానికి 10,000 చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, అయితే మహారాష్ట్రలో పంట నష్టపోయిన రైతులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు పథకం కింద హెక్టారుకు రూ.13వేలు చెల్లించిందన్నారు. అదే విధంగా అక్కడి ప్రభుత్వం రుణాలు సకాలంలో చెల్లించినవారికి ఇన్సెంటివ్ సైతం అందజేసిందని వివరించారు. అయితే బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సరిగ్గా అమలు చేయకుండా నిధులను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఫలితంగా ఎంతో మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో 2018- 19, 20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫసల్ బీమా యోజన నష్టపరిహారం ప్రీమియం సైతం రైతులు న్యాయస్థానానికి వెళ్తే రాష్ట్ర ప్రభుత్వం దిగి రాలేదని, జిల్లాలోని సుమారుగా 300 మంది రైతులకు పలు సాంకేతిక కారణాల ద్వారా నిధులు విడుదల కాలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని, ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులను సైతం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గండె విజయ్ కుమార్, శివయ్య, గన్నోజి విజయ్, సతీష్ రెడ్డి, తోకల నరేష్, కాంత, ముఖీం, ప్రశాంత్, జైపాల్, రవీందర్ ఉన్నారు.

## ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని సోనార్ గల్లికి చెందిన రాజేందర్ (35) అదృశ్యమైన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. భార్యాభర్తలకు జరిగిన చిన్నపాటి గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన రాజేందర్ ఉదయం 10.30గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన రాజేందర్ తల్లి గంగమ్మ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

# గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్

- సినీ ఫక్కీలో ఛేదించిన పోలీసులు
- రూ.18లక్షల విలువైన 90 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో ముగ్గురు, ఇరువురి అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి




గంజాయి స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న పోలీసులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని టోల్‌ప్లాజా వద్ద అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టుబడింది. పోలీసుల వివరాల ప్రకారం... దిలావర్‌పూర్‌లోని టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్ వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ కారును నిలిపారు. అంతలోనే కారులోనుంచి రావూఫ్ అనే వ్యక్తి పారిపోయాడు. అనుమానం వచ్చిన పోలీసులు కారులోని షేక్ అరీఫ్, మహ్మద్ అన్వర్‌లను పోలీసులు ఆరా తీశారు. అయినా వారు ఏమి చెప్పకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు కారును పరిశీలించారు. కారు డిక్కీ భాగంలో స్టెప్నీ ఉంచే ప్రదేశంలో మెటల్ షీట్‌తో వెల్డింగ్ చేయడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. గడ్డపారాతో మెటల్ షీట్‌ను తొలగించారు. అందులో 26 గంజాయి సీల్డ్ ప్యాకెట్లు లభించాయి. దీంతో తహసీల్దార్ కరీం సమక్షంలో పంచనామా నిర్వహించి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన షేక్ ఆరీఫ్, మహ్మద్ అన్వర్‌లను పోలీసులు తమదైన తీరులో ప్రశ్నించగా అసలు విషయం తెలిపారు. షేక్ అరీఫ్, మహ్మద్ అన్వర్, రావూఫ్ ముగ్గురు స్నేహితులు. ఇందులో అరీఫ్, రావూఫ్ గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చారు. త్వరగా డబ్బులు సంపాదించాలనే ఆశతో భద్రాచలం సరిహద్దు రాష్ట్రమైన ఒరిస్సా నుంచి గంజాయి తీసుకుని వచ్చే మహ్మద్ అబ్దుల్ అలీచాస్ కొకన్, అమ్రిత్ నుంచి రూ.18 లక్షలు విలువచేసే 90కేజీల గంజాయిని కిలోకు రూ.4వేల చొప్పున కొనుగోలు చేశారు. దానిని మహారాష్ట్రలోని నాందెడ్‌లో కిలోకు రూ.20వేలకు విక్రయించేందుకు కారులో బయలుదేరారు. హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర వెళ్లే క్రమంలో దిలావర్‌పూర్ టోల్ ప్లాజా వద్ద పోలీసులకు చిక్కారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

# పెన్షనర్లకు ఆదాయపన్ను రద్దు చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగయ్య

ఆదిలాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల ఆదాయపన్ను రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్లకు కోవిడ్-19 పేరుతో నిలిపివేసిన రైల్వే చార్జీల్లో రాయితీని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మూడోవ మహాసభలను స్థానిక పీఆర్టీయూ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నూతన పెన్షన్ విధానాన్ని దేశ వ్యాప్తంగా రద్దు చేయాలని, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, హిమచల్ ప్రదేశ్, జార్ఖండ్, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలుకు నిర్ణయించాయని తెలిపారు. ఇటీవల ఢిల్లీలో 50 జాతీయ, రాష్ట్ర సంఘాలు పాత పెన్షన్ విధానం కోసం సమావేశమై దశలవారీ పోరాటాన్ని ప్రకటించాయని, అందులో తమ సంఘం కూడా భాగస్వామి అవుతుందని తెలిపారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం 12వ పీఆర్సీని సకాలంలో నియమించి నూతన వేతనాలు, పెన్షన్లు అమలు చేయాలని కోరారు. సిఫారసుల ప్రకారం డెత్ రిలీఫ్ కనీసం రూ.30 వేలు, 20 ఏళ్ల సర్వీసుకు పూర్తి పెన్షన్ వంటి జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్, డీఏలు, ఉచిత వైద్యం, హైయ్యర్ పెన్షన్ ఆప్షన్ అందరికీ వర్తింపజేయాలన్నారు. కోల్ పెన్షనర్ల కనీస పెన్షన్ రూ.15 వేలు ఇవ్వాలని, ఒకే ర్యాంక్ ఒకే పెన్షన్ విధానం అమలు చేయాలని, పెన్షన్, గ్రాట్యూటీ చెల్లింపుల్లో అధికారులకు, కార్మికులకు మధ్య వ్యత్యాసం తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శశికాంత్, జగన్‌మోహన్, దయాకర్‌రెడ్డి, బాపురావు, ఉమకాంత్ పాల్గొన్నారు.

# 'ఉపాధి'లో వెలుగుచూస్తున్న అక్రమాలు

- అంగన్‌వాడీ హెల్పర్‌కు ఉపాధి కూలి చెల్లింపు



సామాజిక తనిఖీ గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

ఖానాపూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీల్లో అవినీతి అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. మండలంలోని మేడంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో బీఆర్‌పీ పవన్ తనిఖీలో వెలుగుచూసిన పలు అక్రమాలను గ్రామస్తులకు సభలో చదివి వినిపించారు. గ్రామానికి చెందిన ఓ అంగన్‌వాడీ హెల్పర్‌తో పాటు పంచాయతీ కార్మికుడికి ఉపాధి హామీలో పని కల్పించడంతో పాటు కూలి డబ్బులు సైతం చెల్లించినట్లు తెలిపారు. గ్రామంలో జరిగిన 33 పనులకు పలు పనుల్లో ఇష్టారాజ్యంగా చెల్లింపులు చేసినట్లు వివరించారు. పలు మస్టర్‌లలో గ్రూప్ సభ్యుల సంతకాలు వేరే వారు చేశారని, ఇంకొన్ని మస్టర్‌లలో పలువురు కూలీల సంతకాల స్థానంలో వేలిముద్రలు ఉన్నాయన్నారు. గ్రామంలోని 70మంది కూలీలు 100 రోజులు పని దాటాక చేసిన పనులకు సంబంధించిన రూ.74వేలు పేమెంట్ కాలేదని, హరితవనంలో నాటిన 1600 మొక్కలు చనిపోయినట్లు గుర్తించామన్నారు. ఇంకొన్ని చోట్ల తక్కువ కొలతలకు ఎక్కువ కూలి చెల్లించారని నిర్ధారించినట్లు చెప్పారు.

**ప్రతీ కూలికి ప్రశ్నించే తత్వం రావాలి..**
ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కూలికి ప్రశ్నించే తత్వం వస్తేనే శ్రమకు తగిన ఫలితం రావడంతో పాటు అక్రమాలు తగ్గుతాయని ఎస్ఆర్‌పీ రాఘవ అన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో మాట్లాడారు. పని కోసం ప్రతి కూలీ దరఖాస్తు పెట్టుకోవాల్సి ఉంటుందని వివరించారు. తెల్లకాగితంపై కూడా దరఖాస్తు పెట్టొచ్చన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే అధికారులతో పాటు టోల్‌ఫ్రీకి ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజునాయక్, కార్యదర్శి రంజిత్ ఉన్నారు.

# ఒంటరి మహిళను మోసంచేసిన కానిస్టేబుల్

- పదిహేను రోజుల క్రితం అబార్షన్ చేయించిన వైనం
- పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నం
- ఆలస్యంగా వెలుగులోకి..
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ రాజేశ్వర్ ఓ ఒంటరి మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జవ్వాజి రాజేశ్వర్ కొంతకాలంగా ఖానాపూర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. జగిత్యాల పట్టణానికి చెందిన ఓ వివాహిత భర్తకు విడాకులు ఇచ్చి ఒంటరిగా పట్టణంలో నివాసం ఉంటుంది. రాజేశ్వర్ సదరు మహిళను పెళ్లి చేసుకుంటానని కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో సదరు మహిళ గర్భం దాల్చింది. దీంతో 15 రోజుల క్రితం అబార్షన్ చేయించాడు. అప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో బాధితురాలు గురువారం తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. రాజేశ్వర్ నిరాకరించడంతో పట్టణంలోని విద్యానగర్‌లో ఉండే తన ఇంట్లో ఎలుకల మందు తాగింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం నిర్మల్‌కు తరలించగా అక్కడి నుంచి జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలికి 11 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య

జనగామరూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేలమందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందుసేద్యం వసతి కల్పిస్తున్నారని, పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.